క్లుప్తంగా

షీటీంపై అవగాహన

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై శనివారం షీ టీం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం పోలీసులు బాలరాజ్, సమీనాలు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థుల రక్షణ, భద్రతకోసం షీటీం పని చేస్తుందన్నారు. ఏమైనా ఆపద ఉన్నా 8712670390కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం

మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జమీల్‌ను శనివారం మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వ, దేవాదాయ భూములను కాపాడాలని బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు సూచించారు. ఇందుకు తమ పార్టీ సహకారిస్తుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, నాయకులు రాజేష్, వేణు, మహేష్, నిఖిల్, దేవేందర్‌గౌడ్, చెన్నయ్య, మల్లేష్, నర్సింహులు, రాజు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేద్దాం

నారాయణపేట: ఆశా కార్యకర్తలకు వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను చేయాలని కోరుతూ ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆశా యూనియన్ పిలుపుమేరకు జిల్లాలోని ఆశా కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలమణి తెలిపారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో చలో హైదరాబాద్ వెళ్తున్నట్లు సూపర్‌వైజర్ తబితరాణికి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కార్యకర్తలు పార్వతి, రేణుక, రషీద, శ్రీదేవి, విజయలక్ష్మి ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

ఊట్కూరు: మండలంలోని సీపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన సునంద పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయురాలిని శనివారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు.. ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి సురేష్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి హెచ్‌ఎం ఎనలేని కృషి చేశారని తెలిపారు. అనంతరం తోటి ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా బోనాల పండుగ

మక్తల్: పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శనివారం భారతి విద్యానికేతన్ పాఠశాలల్లో బోనాల పండుగను కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషాధారణతో అలరించారు. కరస్పాండెంట్ నాగిరెడ్డి, చేర్మెన్ కిరణ్, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ అరవింద, కో ఆర్డినేటర్ శ్వేతరెడ్డిపాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న శిరీష, సోని అథ్లెటిక్స్ విభాగంలో చక్కటి ప్రతిభ కనబరచడంతో వరంగల్‌లోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో జీహెచ్‌ఎం డాక్టర్ సునీత, పీడీ రమణ శాలువాతో సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి: ఈ ఏడాది కొత్తగా పట్టా పాస్‌బుక్కులు పొందిన రైతులతోపాట గతంలో తమ పేర్లు నమోదు చేసుకోని రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓలు అజయ్, తిరుపతి సూచించారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని సర్జఖాన్‌పేట, ముంగిమళ్ల గ్రామాల్లో ఏఈఓలు వేర్వేరుగా అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు.

రాయల చంద్రశేఖర్ జీవితం ఆదర్శం

మద్దూరు: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ జీవితం ఎంతో మంది విప్లవ ఉద్యమ నాయకులకు ఆదర్శమని జిల్లా కార్యదర్శి బి. రాము తెలియజేశారు. శనివారం మండల కేంద్రంలో కామ్రేడ్ చంద్రశేఖర్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాస్‌లైన్ కార్యదర్శి కొండ నర్సింహులు, ఉదయ్, అంజి, సాయప్ప, మహేష్, బాల్‌రాజ్, గౌస్, వెంకటేష్, వెంకటయ్య, కిష్టప్ప, అంజిలప్ప పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో నెలలోని నాల్గో శనివారం పురస్కరించుకొని నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు.. పలువురు విద్యార్థులు నృత్య ప్రదర్శన, ఏకపాత్రాభినయం, ఉపన్యాసం, ఇతర క్రీడలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

బీజేపీ మండల విస్తృతస్థాయి సమావేశం

దామరగిద్ద: మండలంలోని శనివారం బీజేపీ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పగడాకులు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు పథకాలను వివరించారు. సత్యనారాయణ, జిల్లా నాయకుడు గోపాల్‌రావ్, అంజిలప్ప, సంజీవగౌడ్ పాల్గొన్నారు.

ముసురుతో జర జాగ్రత్త



వసతి గృహంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

- వరద నీటితో వ్యాధుల ముప్పు
- పరిశుభ్రతే ప్రధాన ఆయుధం
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాగనూర్: వర్షకాలంలో గ్రామాల్లో కురుస్తున్న వర్షాలు వ్యాధులను వెంట తీసుకొచ్చే ప్రమాదం ఉంది. పరిసరాల్లో నీటినిల్వ పెరిగిదోమలు వ్యాప్తి చెంది డింగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వైద్యాధికారులు సూచిస్తున్నారు.

రోగాల వ్యాప్తికి అనుకూలం..

వర్షాల కారణంగా ఇళ్లలో నీటి వినియోగమూ తక్కువే. పరిసరాల్లో డబ్బాలో నిలిచిన నీటితో దోమలు వ్యాప్తి చెంది. లార్వా వృద్ధి చెందుతుంది. ఈ దోమలు ఇళ్లలోని అల్మారాలు, ఫర్నిచర్ వెనుక నక్కి ఉంటాయి. శిథిల భవనాలు, ఖాళీగా ఉన్న ఆవాసాల్లో శుభ్రత లోపించి దోమలు వృద్ధి చెందేందుకు అస్కారముంటుంది. వాతావరణం అనుకూలించగానే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతాయి. పైపు లైన్ లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



వర్షాలతో వ్యాధులు వ్యాప్తి చెందడానికి అస్కారం ఉంటుంది. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవు. అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యుడ్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాల బారిన పడకుండా ఉంటాం.

– నాగజ్యోతి, మండల వైద్యాధికారి మాగనూర్

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ కుండా చూసుకోవాలి. కూలర్లు, డ్రమ్ములోని నీటిని పారబోయాలి. పాత్రలపై మూతలు పెట్టి ఉంచాలి.
- ఇంట్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- చల్లదనం పెరిగిన నేపథ్యంలో ఊపిరితిత్తుల సమస్యలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెచ్చదనం ఉండేలా చూడాలి.
- కాచి చలార్చిన నీటితోపాటు, వేడి పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి.
- మాంసాహారం తగ్గించడంతోపాటు బయటిఫుడ్‌కు దూరంగా ఉండాలి.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



మరికల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కోస్గిలో చిత్ర ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

మరికల్: మండల కేంద్రంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా మండలంలోని ఏంజెల్స్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లేష్, తిరుపతయ్య, రఘు, జీవన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కోస్గి: విద్యార్థులకు చదువుతోపాటు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించాలని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని అణు శక్తిరంగంలో అబ్దుల్ కలాం పాత్ర అనే అంశంపై ప్రత్యేక అవగాహన నిర్వహించారు. అనంతరం కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు అబ్దుల్ కలాం జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్వ: మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ అన్నారు. శనివారం కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ రఫీ, నాయకులు డా.శంకర్, ఖలీల్ అమ్మద్, టైలర్ మౌలాలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ పాఠశాలలో శనివారం ఏపీజే. డా అబ్దుల్‌కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆయన దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్‌కుమార్, రమేష్, మనోహర్, సత్యపాల్, బనేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీవీపీ ఆధ్వర్యంలో నిరసన



నారాయణపేట: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యరంగానికి 7.3 శాతం మాత్రమే నిధులను కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం టీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పలువురు మాట్లాడారు.. పాఠశాలస్థాయి మొదలు, యూనివర్సిటీ దాకా ఉన్న విద్యారంగ ఖాలీలను భర్తీ చేయాలి, బడులలో మౌలిక వసతులను అత్యవసరంగా కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో 15శాతం నిధులను ఇస్తామని వాగ్దానం చేసి, ఆచరణలో మాత్రం 7.3 శాతం మాత్రమే కేటాయించడం అభ్యంతకరమన్నారు. విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు రెడ్డెప్ప, సూర్యచంద్ర, హైమావతి, గజలప్ప, టీచర్ జ్యోతి, ప్రశాంత్, కార్తీక్, పీడీఎస్ నాయకులు సాయికుమార్ పాల్గొన్నారు.

డీఎస్సీ కార్యాలయానికి తరలిన పండిత్, పీఈటీలు

నారాయణపేట రూరల్: జిల్లాల వారిగా మిగిలిపోయిన భాషాపండితులు, పీఈటీల పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేసి తదుపరి సీనియార్టీ కల్గిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ పేట నుంచి పలువురు టీచర్లు హైదరాబాద్ తరలివెళ్లారు. శనివారం డీఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. పండిత్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపుతున్నామని, సగంలో ఆపకుండా పూర్తిస్థాయిలో భర్తీ డిమాండ్ చేశారు. హేమ, పారిజాత, ఉమా, సుజాత పాల్గొన్నారు.

పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలి

కోస్గి: ప్రభుత్వం భాషా పండిట్‌లను, పీఈటీలను ఇటీవల అప్‌గ్రేడ్ చేసిందని, అందులో కొంతమందిని అప్‌గ్రేడ్ చేయలేదని, మిగిలిపోయిన వారిని సైతం అప్‌గ్రేడ్ చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేరి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తపస్ ఆధ్వర్యంలో కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలో చేపట్టిన సభ్యత్వ అభియాన్‌కు ఆయన హాజరై మాట్లాడారు.. ప్రభుత్వం వివక్ష చూపకుండా అందరు భాషా పండితులను, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, వెంకటేష్, అనంతయ్య, రవితేజ, సత్య కుమార్, ఆంజనేయులు, శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట: ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ అన్నారు. శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులు శోబారాణి కుటుంబానికి రూ. 35 వేలు, శకుంతల బాయికి రూ. 15వేలు, ధన్వాడకు చెందిన రోహిణికి రూ. 39వేలు చెక్కులను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి ఆపిరెడ్డిపల్లి రాము, కో–శాధికారి హన్మంతరావు, కౌన్సిలర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

బీసీలను దగా చేసిన ప్రభుత్వం

నారాయణపేట: బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సీట్ల నుంచి బడ్జెట్ కేటాయింపు వరకు అడుగడుగునా బీసీలను దగా చేశారని బీసీసేన నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మయ్య విమర్శించారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు.. బడ్జెట్‌లో 3 శాతం నిధులను కేటాయించి అభివృద్ధికి దూరం చేశారని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మన్సూర్, జగదీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

దామరగిద్ద: మండలంలో కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాలకు చెందిన 2008–09 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు 200 ప్లేట్లను జీహెచ్‌ఎం అన్నపూర్ణ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ మేరకు.. జీహెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థుల సేవాభావాన్ని ప్రశంసించారు. వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం



గ్రామస్తులకు సూచనలిస్తున్న పోలీసులు

మద్దూరు: ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత కోసమే కార్డెన్ అండ్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఎస్. లింగయ్య తెలిపారు. శనివారం మండలంలోని దోరేపల్లి బీసీకాలనీలో ఉదయం కార్డెన్ అండ్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కాలనీలోని 250పైగా ఇండ్లను పోలీసులు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 19బైకులను, ఒక ఆటోను సీజ్ చేశారు. గ్రామంలో గోపాల్‌గౌడ్ షాప్‌లో 6.5 లీటర్ల మద్యం పట్టుకున్నారు. వాటి విలువ రూ. 1,625 యాజమానిపై కేసునమోదు చేశారు. ఈ మేరకు.. గ్రామంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావడం కానీ, 100 డయల్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల, మోసగాళ్ల ఫోన్‌కాల్స్ స్పందించవద్దని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైన వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కోస్గి సీఐ దుస్రునాయక్, ఎస్ఐలు రాంలాల్, వెంకటరమణ, స్పెషల్ పార్టీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



చిట్యాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

మక్తల్: మండలంలోని చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం వవన వనమహోత్సవంలో భాగంగా హెచ్‌ఎం సవిత మొక్కలు నాటి నీరు పోశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కాపాడుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు విధుర్‌కుమార్, రవీందర్‌రెడ్డి, వరలక్ష్మి, దత్తు, మౌలాలి, సుశీలమ్మ, సరోజనమ్మ, తిరుపతమ్మ, మహెష్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం మండల పరిషత్ పాఠశాలలో శనివారం శిక్షా సప్తహ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం శాంతి లక్ష్మి మాట్లాడుతూ.. మొక్కలతో మనకు చాలా లాభాలున్నాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఉపాధ్యాయులు పావని, శ్రీవిద్య పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు.. పాఠశాల ఆవరణలో విద్యార్థులచే మొక్కలు నాటించారు. హెచ్‌ఎం ముద్దం జయప్రకాష్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఇండ్ల పరిసరాలలో ఐదు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మొక్కలు నాటడంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటప్ప, ఆంజనేయులు, సుజాత పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నర్సింహులు

మద్దూరు: మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో–ఆర్డినేటర్ నర్సింహులు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. బాలలకు ఏ సమస్య ఉన్న 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. బాలల హక్కులు, వారి రక్షణ కోసం జిల్లా కేంద్రంలో బాలరక్షక్ భవన్ ఉందని గుర్తుచేశారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజునాయక్, సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్‌నాయక్, అశ్విని, ఉపాధ్యాయులు రాజేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

మక్తల్: మక్తల్‌లో విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో శనివారం రాస్తారోకో చేపట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు. ఆదివారం మక్తల్ బంద్‌కు పిలుపునిచ్చారు. న్యాయవాది శ్రీనివాసులు, నర్సింహ, రాంలింగం, కుర్మయ్య, వినయ్, విజయ్ పాల్గొన్నారు.

గ్రామంలోనే పింఛన్ల పంపిణీ



నారాయణపేట రూరల్: ఎన్నో సంవత్సరాలుగా వ్యాయ ప్రయాసలు పడుతూ.. పింఛన్ డబ్బులకు పక్క గ్రామానికి వెళ్లి పడుతున్న అవస్థలకు కాలం చెల్లింది. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చొరవతో పోస్టల్, పోలీసుశాఖలతో సమన్వయం చేసి సొంత గ్రామంలోనే డబ్బులు ఇప్పించడంలో సఫలీకృతమయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని శ్యాసన్‌పల్లి, శేర్నపల్లి జీపీలతోపాటు ఆమ్లెట్ గ్రామమైన కొత్తపల్లితండాకు చెందిన వృద్ధులు, దివ్యాంగులకు ప్రతినెల ప్రభుత్వం అందించే పింఛన్ డబ్బులకు సింగారం గ్రామానికి వెళ్లాల్సి వచ్చేది. డబ్బులు అయి పోతే మరోనాడు రావాల్సిన దుస్థితి ఉండేది. అయితే విషయాన్ని ఎన్నిసార్లు పోస్టల్ అధికారులకు తెలియజేసిన సెక్యూరిటీ సమస్య పేరుతో దాటవేసుకుంటూ వచ్చారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని పింఛన్ పంపిణీ సమయంలో పోస్టల్ అధికారి వెంట పోలీసు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేయించడంతో శనివారం శ్యాసన్‌పల్లి, శేర్నపల్లివాసులు స్థానికంగా పింఛన్ డబ్బులు తీసుకున్నారు. ఎన్నో ఏళ్ల సమస్యను తీర్చడంపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి కాడెద్దు మృతి

దామరగిద్ద: మండలంలోని నర్సాపూర్‌కు చెందిన రైతు శనివారం సాయంత్రం తన పొలంలోని కాడెద్దు మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెనిసింగ్ లేక పోవడంతో ఎద్దు కొమ్ములకు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఈ విషయమై పశువైద్యులు, విద్యుత్ లైన్‌మేన్‌లు పంచనామా చేశారు. బాధిత రైతును ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోడకూలి మేకలు మృతి..

ధన్వాడ: మండల కేంద్రంలోని కోటపక్క వీధిలో శనివారం తెల్లవారు జామున గోడకూలి మూడు మేకలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన అచ్చిబాబు రోజులాగే మేకల కొట్టంలో మేకలను కట్టేశారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షానికి గోడకూలి మేకలపైపడంతో మేకలు మృతిచెందిందని అచ్చిబాబు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

'చలో ఢిల్లీ'కి తరలిరండి..

మాగనూర్: ఎస్సీల వర్గీకరణకు మాల మాహానాడు ఆధ్వర్యంలో వచ్చేనెల 8, 9, 10 తేదీలలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహాధర్నాకు తెలుగు రాష్ట్రాల నుంచి మాల, మాల ఉపకులాలకు చెందిన కార్యకర్తలు, అంబేద్కర్ వాదులు హాజరవుతారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 8న ఢిల్లీలో చేపట్టే ధర్నాకు కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయా లని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, నాయకులు కావలి రమేష్, మహేష్, రాఘవేందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వృద్ధుల పాట్లు


నర్వ: ఆసరా పింఛన్ కోసం మండలంలోని పాతర్చేడ్‌లో వృద్ధులు అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గతకొన్ని రోజులుగా గ్రామంలో పింఛన్ పంపిణీ చేసే పోస్టల్ బీపీఎం భీమేష్ వేలి ముద్రలు పడని వృద్ధులను ఖచ్చితంగా తమ వద్దకు తీసుకొస్తేనే పింఛన్ అందిస్తామని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నడవలేని వృద్ధులు పడరానిపాట్లు అనుభవిస్తున్నారని వారు వాపోతున్నారు. దీనిపై శనివారం పింఛన్‌ల పంపిణీ వద్ద దాదాపు 30మందికి పైగా గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. వేలిముద్రలు రాని వారు, ఇబ్బందులు లేకుండా చూసేందుకు సహకరించి పింఛన్‌లు అందిద్దామని సూచించినట్లు పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మత్స్యకార కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి

ధన్వాడ: జిల్లాకు మత్స్యశాఖ అధికారిని నియమించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ కమిషనర్, చైర్మన్‌లకు జిల్లా మత్స్యకారిక సంఘం ఉపాధ్యక్షుడు నిరటి నర్సింహులు నాయుడు వినతి పత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో డైరెక్టర్లు విజయ్‌కుమార్, వెంకటేష్, ఆనంద్‌కుమార్, నాగరాజు, రాములు, బాలరాజు ఉన్నారు.

కౌడీ పీర్ల పండగొచ్చింది..

- మొహర్రం తర్వాత కౌడీపీర్ల పండుగ
- 28, 29న, హజ్రత్ మౌలాలీ సవారి
- మతసామరస్యానికి ప్రతిక ఈ ఉత్సవాలు
- చారిత్రక నేపథ్యం కల్గిన లంకాల కౌడీపీర్లు
- కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తుల రాక



కొలువు ధీరిన హజరత్ మౌలాలీ పీరు

నర్వ: తెలంగాణ ప్రజల ప్రధాన ఉత్సవం మొహర్రం పండుగ ముగిసింది. కొద్దిరోజులకే కౌడీ పీర్ల పండగ రానే వచ్చింది. మక్తల్ నియోజకవర్గంలోనే అత్యంత వైభవంగా నిర్వహించే కౌడీపీర్ల ఉత్సవాలు మండలంలోని లంకాల్ గ్రామంలో వారం రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తుంది.

చారిత్రక నేపథ్యం:

కౌడీపీర్లకు వంద సంవత్సరాల చారిత్రక నేపథ్యం కల్గినట్లు గ్రామస్తులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా ఈ ఉత్సవాలు నానాటికి ఆదరణ పెరుగుతుందని వారంటున్నారు. దీనికి కారణం భక్తులకు కోరుకున్న కోరికలు తీర్చే కొంగుబంగారమైన హజ్రత్ మౌలాలీ పీర్లే వీరి ఇష్టదైవం. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులు తమ ఇష్ట దైవానికి మొక్కులు ఇచ్చేందుకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో లంకాల్ గ్రామానికి వస్తారు..

దట్టీలు.. కందూర్లు..

ప్రధానంగా హజ్రత్ మౌలాలీ కౌడీ పీర్లకు మొక్కులు తీర్చుకునే భక్తులు దట్టీలు సమర్పిస్తారు.. వీటితోపాటు గ్రామంలోని ఇంటింటికీ కందూర్లు చేయడం ఆనవాయితీ. దీంతో వారం చివరి రెండురోజులు సవారీలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకుంటారు. కందూర్లతో భక్తులు ఇంటింటికి చుట్టాలను పిలుచుకోవడంతో లంకాల్ గ్రామంలో భక్తులతో కిటకిటలాడుతుంది.

30ఏళ్ల నుంచి సవారి ఎత్తుతున్న బాబుమియా..

గత 30ఏళ్ల నుంచి లంకాల్‌లోని కౌడీపీర్ల సవారిని బాబుమియా ఎత్తుతున్నాడు. సవారికి ముందు అత్యంత భక్తిశ్రద్ధలతో సవారిని నిర్వహించడం గత కొన్నేళ్లు ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

28, 29న, సవారీలు..

ఈ నెల 28న, 29న హజ్రత్ మౌలాలి సవారీలు ఉంటాయి. ఇందులో 28న, రాత్రి సవారీ, 29న, పగలు సవారితో ఉత్సవాలు తొమ్మిదిరోజులపాటు ముగిస్తాయి. ఈ రెండు రోజులు సవారీలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులు తీర్చుకుంటారు.

సవారికి ప్రతి ఏడాది వస్తున్నాను..



లంకాల్ గ్రామంలో ప్రతి ఏడాది నిర్వహించే కౌడీ పీర్ల ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో కలిసి వస్తుంటాం. కోరిన కోరికలు తీర్చే హజ్రత్ మౌలాలీ పీరును దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నాం. ఈ కౌడీపీర్ల సవారీ ఉత్సవాలను ప్రతి ఏటా ముందుండి కార్యక్రమాల నిర్వాహణను పర్యవేక్షిస్తుంటాను. ఆయన దయ వల్ల అంతా మంచే జరుగుతుంది.

– రాధ కిషన్‌రావు, భక్తుడు మక్తల్ గ్రామం

లంకాల్ గ్రామానికే శోభాయమానం



ప్రతి ఏడాది నిర్వహించే కౌడీపీర్ల ఉత్సవాలతో లంకాల్ గ్రామం శోభాయమానంగా వెలిగిపోతుంది. దీంతో కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో లంకాల్ గ్రామానికి కౌడీపీర్ల ఉత్సవాలకు పేరొన్నికైంది. ఈ ఉత్సవాలను తిలకించడం హజ్రత్ మౌలాలి దయతో పాటు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.

– రఫీబేగ్, భక్తుడు లంకాల్